# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్ లో భగవద్గీతతో పాటు ప్రముఖ సంగీత, నాట్య శాస్త్ర ప్రవీణుడు భరతముని రచించిన నాట్య శాస్త్రానికి స్థానం లభించింది.**

2. **స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నేడు 'ఇ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో తిరిగి ఉపయోగించడం' అనే అంశాన్ని ఇతివృత్తంగా నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

3. **తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు.**

4. **ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.**

5. **సరైన జీవన విధానంతో వ్యాధులను అరికట్టవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

=========================

భగవద్గీతకు అరుదైన గుర్తింపు లభించింది. యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో భగవద్గీతకు స్థానం లభించింది. భగవద్గీతతో పాటు క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దానికి చెందిన ప్రముఖ సంగీత, నాట్య శాస్త్ర ప్రవీణుడు భరతముని రచించిన నాట్య శాస్త్రానికి కూడా ఈ రిజిస్టర్‌లో స్థానం దక్కింది. ఈ నెల 17వ తేదీన కొత్తగా 74 డాక్యుమెంటరీలు యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్ లో చేరాయి. వాటిలో భగవద్గీత, ప్రాచీన భారతీయ నాట్య శాస్త్రం ఉండడం విశేషం.

భగవద్గీత, నాట్య శాస్త్రాలకు యునెస్కో గుర్తింపు లభించడం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ అంశమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమంలో హర్షం వ్యక్తం చేశారు. గీత ..., నాట్య శాస్త్రాలు శతాబ్దాలుగా నాగరికతను, చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ప్రపంచానికి స్ఫూర్తిగా నిస్తున్నాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోందని కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చెప్పారు.

-------------------------

స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నేడు 'ఇ–వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో తిరిగి ఉపయోగించడం' అనే అంశాన్ని ఇతివృత్తంగా ఎంచుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం ప్రతి నెలా 3వ శనివారం నాడు జరుపుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, యువత పాల్గొనాలని కోరారు. ఎక్కడికక్కడ ఇ–వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వీటి నిర్వహణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

---------------------------

జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి టోక్యోలో నిన్న నిర్వహించిన ఇండియా–జపాన్ భాగస్వామ్య రోడ్‌షోలో పాల్గొన్నారు. జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర బృందం సమావేశమైంది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని జపాన్ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు అనుకూలతలను వివరించారు. విద్యుత్ వాహనాలు, దుస్తుల తయారీ, డేటా సెంటర్లు, సరుకు రవాణా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం ప్రచార వీడియోలను అధికారుల బృందం ప్రదర్శించింది. హైదరాబాద్ అభివృద్ధికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నానని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

---------------------------

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిని స్థానిక శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. అదేవిధంగా కోటి రూపాయలతో కొన్ని అభివృద్ధి పనులను కొనసాగుతున్నాయని వెల్లడిస్తూ...

వాయిస్...34 సెకన్లు

---------------------------

సరైన జీవన విధానంతో వ్యాధులను అరికట్టవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు "ప్రపంచ కాలేయ దినం" జరుపుకుంటున్న సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ... కాలేయ వ్యాధుల్ని అరికట్టడానికి సరైన ఆహారం, జీవన అలవాట్లను అనుసరించాలని కోరారు. 'ఆహారమే మందు' అనే ఇతివృత్తంతో... పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా కాలేయ వ్యాధుల్ని అరికట్టే దిశగా ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడానికి ప్రపంచ కాలేయ దినాన్ని జరుపుకుంటున్నట్లు చెప్పారు. 38 శాతం ప్రజల్లో ఫాటీలీవర్ సమస్య ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

---------------------------

వ్యవసాయానికి పగటి వేళలో 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో రెండు విద్యుత్ ఉప కేంద్రాలను ఆయన ప్రారంభించారు, అదేవిధంగా మరో మూడు ఉప కేంద్రాల నిర్మాణానికి స్థానిక

పార్లమెంట్ సభ్యులు బి కె పార్థసారథి, జిల్లా ఇన్చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ లతో కలిసి నిన్న భూమి పూజ చేశారు. మడకశిరలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి మూడు విద్యత్ ఉప కేంద్రాలకు భూమిపూజ చేశామని మంత్రి వివరిస్తూ...

వాయిస్...31 సెకన్లు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ మాట్లాడారు.. అతి పెద్ద సోలార్ ప్రాజెక్ట్ మడకశిర ప్రాంతానికి వస్తుందంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి అని పేర్కొంటూ...

వాయిస్...31 సెకన్లు

-------------------------

భూదందాలను సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తన కార్యాలయ అధికారులతో శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విశాఖ, కాకినాడ, కడప, తిరుపతి ప్రాంతాల నుంచి భూదందాలకు సంబంధించిన ఫిర్యాదులు అధిక సంఖ్యలో అందుతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు, వారి ఆస్తులకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. త్వరలో కాకినాడ, విశాఖపట్నాలలో పర్యటించి భూ దందా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తానని, స్వయంగా పరిశీలన చేస్తానని ఆయన తెలిపారు.

-------------------------

రైతులు కోల్పోయిన భూములు వారికే చెందాలనే లక్ష్యంతో భూ భారతి చట్టం తెచ్చినట్లు తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ములుగు జిల్లా, వెంకటాపూర్‌లో నిన్న నిర్వహించిన 'భూ భారతి' రెవెన్యూ సదస్సులో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కలతో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వం చట్టం చేస్తుందని, అయితే దాన్ని అమలు బాధ్యత అధికారులదేనన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా సేవలందించాలని అధికారులు ఆదేశించారు.

-------------------------

తెలంగాణలో నిన్న పలు చోట్ల వర్షం కురిసింది. హైదరాబాదు నగరంలో ఎస్ఆర్ నగర్, బోరబండ, జూబ్లీహిల్స్, కోఠి, నాంపల్లి, హిమాయత్‌నగర్, కార్వాన్, కుత్బుల్లాపూర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో అనేక చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పలు చోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. అనేక చోట్ల చెట్లు కూలిపోయాయి, విద్యుత్ స్థంబాలు విరిగిపోయాయి. మరోవైపు జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలో పిడుగులు పడటంతో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న 12 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరికీ తీవ్రగాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. వీరందరినీ వైద్య సాయం కోసం సమీప ఆసుపత్రికి తరలించారు.

ఆంధ్రపదేశ్ లో అల్లూరి జిల్లా పాడేరు ఏజన్సీ ప్రాంతంలో కూడా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో చెట్లు నేలకూలాయి.

====================